క్లుప్తంగా

ప్రభుత్వ విప్ అడ్లూరి జన్మదిన వేడుకలు



రక్తదానం చేస్తున్న పార్టీ నాయకులు

ధర్మారం: ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జన్మదిన వేడుకలు సోమవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం రక్తదానం చేశారు. పార్టీ నాయకులు దేవి జనార్దన్, ఈదుల శ్రీనివాస్, జంగ మహేందర్ యాదవ్, చిప్ప మణిశర్మ, తుమ్మల శ్రీనివాస్, మెడవేని హరీశ్ పాల్గొన్నారు.

నేడు పెద్దాపూర్ జాతర వేలం

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద శ్రీలక్ష్మీనర్సింహ స్వామి జాతర వేలం మంగళవారం ఈవో సదయ్య సమక్షంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. జాతరకు సంబంధించిన కొబ్బరి కాయలు, పూజా సామగ్రి ఏప్రిల్ 16 నుంచి 25 వరకు అమ్ముకునే హక్కు, స్వామివారి ప్రసాదం లడ్డూలు, పులిహోర, కూల్ డ్రింక్స్ విక్రయం, ఆలయానికి చెందిన వ్యవసాయ భూమి ఒక సంవత్సర కాలానికి లీజుకు తీసుకునేందుకు వేలం నిర్వహిస్తామని చెప్పారు. గ్రామంలోని సంబంధిత ఆలయ ఆవరణలో నిర్వహిస్తామని ఇన్‌చార్జి ఈవో సదయ్య పేర్కొన్నారు. ఆసక్తి గల వ్యాపారులు ముందస్తుగా నిర్ణయించిన దరావత్ సొమ్ము డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని సూచించారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి



మాట్లాడుతున్న కోటం రాజు

రామగుండం: పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తున్న మోదీ ప్రభుత్వాన్ని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.కోటం రాజు కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలని కార్మికవర్గాన్ని కోరారు. సీఐటీయూ అనుబంధ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తుంగపిండి మల్లేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేల్పుల కుమారస్వామి, కనకయ్య, శ్రీనివాస్, భగవంతు, పోశం, పరమేశ్ పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



కమాన్‌పూర్: మండలంలోని గుండారం గ్రామంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న భూదేవి, శ్రీదేవి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు శనివారం విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని సాయిరాం గార్డెన్‌లో సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2000–02లో అప్పటి విజ్ఞాన్ ఇంటర్మీడియట్ కాలేజీలో చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కరస్పాండెంట్ మోహన్ బాబు, లెక్చరర్లు బాలసాని శ్రీనివాస్, పసెడ్ల శ్రీనివాస్‌ను సన్మానించారు.

4న మండల సమావేశం

ముత్తారం: ముత్తారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం 4న జరుగుతుందని ఎంపీపీ జక్కుల ముత్తయ్యపటేల్ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీపీ కోరారు.

అడుగంటిన మా‘నీరు’

- తగ్గుతున్న భూగర్భజలాలు
- పంటలకు నీరందని పరిస్థితి
- ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని పరివాహక ప్రాంత ప్రజల డిమాండ్



గుంపుల వద్ద మానేరు

ఓదెల: పెద్దపల్లి జిల్లా సరిహద్దులోని గుంపుల మానేరు ఎడారిని తలపిస్తోంది. ప్రస్తుతం ఎండలు ముదరడంతో పాటు ఇసుక అక్రమ రవాణాతో మానేరు ఎండిపోవడంతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. మానేరు పరివాహక గ్రామాలైన బాయమ్మపల్లె, ఇందుర్తి, గుంపుల, కనగర్తి, గుండ్లపల్లె, మడక, పొత్కపల్లి గ్రామాల్లో భూగర్భజలాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో చేదబావుల్లో నీరు అడుగంటిపోయాయి. సమీప గ్రామాల్లో మంచినీటి ఎద్దడి నెలకొందని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంటలు ఎండుతున్నాయి

మానేరు పక్కన గల ఇందుర్తి, బాయమ్మపల్లె, గుంపుల గ్రామాల్లో వ్యవసాయబావుల్లో సైతం నీరందకపోవడంతో పంటలసాగుకు నీరందక ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మానేరులో వేసుకున్న మడక, బాయమ్మపల్లె, ఇందుర్తి, గుంపుల, విలాసాగర్, శంభునిపల్లె, వావిలాల, నాగారం, పాపక్కపల్లె గ్రామాలకు చెందిన రైతుల పంటపొలాలకు బోర్లలో నీరందక ఆందోళన చెందుతున్నారు. మానేరులో నిర్మించిన చెక్‌డ్యాంలు వర్షాల ఉధృతికి కొట్టుకుపోవటంతో నీటినిల్వలు లేకుండా పోయాయని రైతులు వాపోతున్నారు. ఇసుక అక్రమ రవాణాతో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. చెక్‌డ్యాంలు మళ్లీ నిర్మించాలని, ఇసుక అక్రమ రవాణాను నియంత్రించాలని పరివాహక ప్రాంతవాసులు కోరుతున్నారు.

మంచినీటి సమస్య



మానేరులో చుక్కనీరు లేకపోవడంతో చేదబావులు అడుగంటి పోయి మంచినీటి సమస్య ఏర్పడింది. తలాపున మానేరు ఉన్నప్పటికీ మంచినీళ్ల కోసం అరిగోస పడుతున్నాం. ఎండల తీవ్రత పెరుగుతున్నందున మానేరులో ఊట పూర్తిగా బంద్ అయింది.

– దుర్గం సదయ్య, గుంపుల

చెక్‌డ్యాంలను నిర్మించాలి



నీటినిల్వల కోసం మడక, గుంపుల, ఇందుర్తి గ్రామాల సమీపంలోని మానేరులో నిర్మించిన చెక్‌డ్యాంలు వరదకు కొట్టుకుపోయాయి. వాటిని తిరిగి నిర్మించాలి. రాత్రి, పగలనక ఎలాంటి నిబంధనలు లేకుండా ఇసుక అక్రమ రవాణాతో మానేరులో చుక్కనీరు లేదు. ప్రస్తుతం మనుషులకు, పశువులకు తాగుదామంటే నీళ్లు లేవు.

– పోలోజు రాజు, బాయమ్మపల్లె

పంటలు ఎండుతున్నాయి



మానేరు నుంచి ఇసుక అక్రమ రవాణాను ప్రభుత్వం వెంటనే ఆపాలి. ప్రస్తుతం మానేరులో వేసిన బోర్లద్వారా చుక్కనీరందకపోవడంతో పంటపొలాలు ఎండిపోతున్నాయి. చేతికి వచ్చే వరిపంటలకు నీళ్లందక పోవడంతో ఎండిపోతున్నాయి. ప్రభుత్వం ఎస్సారెస్పీ కాలువనీటితో మానేరులో నీటి నిల్వలను పెంచాలి.

– ఉప్పు సదయ్య, గుంపుల

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ధర్మారం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండలంలోని రచ్చపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంశీ కోరారు. సోమవారం గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశానికి ప్రధానోపాధ్యాయుడు వంశీతో పాటు ఉపాధ్యాయులు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను, తొలిమెట్టు ద్వారా విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య గురించి మహిళలకు వివరించారు. ఉపాధ్యాయులు సంపత్, లక్ష్మణ్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ తాళ్లపెల్లి ప్రమీల పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు

ఎలిగేడు: మండలంలోని లాలపల్లి మల్లికార్జునస్వామి దేవాలయంలో సోమవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో నల్ల ఫౌండేషన్ అధ్యక్షులు నల్ల మనోహర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ కొప్పెర రాజేశ్వర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మామిడి డిల్లేశ్వర్‌రెడ్డి, కోశాధికారి చిగుర్ల రాములు, మాజీ చైర్మన్ గుర్రం మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, కార్యవర్గసభ్యులు తీపిరెడ్డి మల్లారెడ్డి, కోమటిరెడ్డి హనుమంతరెడ్డి, తీపిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఏలేటి మల్లారెడ్డి, ఎలిగేడు సింగిల్‌విండో చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేడిపల్లి సెంటర్ చిరు వ్యాపారులకు స్థలాల కేటాయింపు

జ్యోతినగర్: మేడిపల్లి సెంటర్ చిరు వ్యాపారులకు స్థలాన్ని సోమవారం మార్కింగ్ చేసి కేటాయించారు. ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లో చిరు వ్యాపారాలు చేసుకునే వారి కోసం వారసంత సమీపంలోని స్థలాన్ని మార్కింగ్ చేసి నంబర్ల వారీగా మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ చిరు వ్యాపారులకు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రీన్ బెల్ట్ ఏరియాలో అక్రమంగా నిర్మాణాలు చేసుకుని వ్యాపారులు చేసుకునే వాటిని ఇటీవల నోటీసులు ఇచ్చి కూల్చివేశారు. చిరు వ్యాపారులు తమ జీవనోపాధి కోసం స్థలాలను కేటాయించాలనే వినతితో వారికి సండే మార్కెట్ ఏరియాలోని స్థలాన్ని పలువురికి మార్కింగ్ చేసి కేటాయించారు. టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీనివాసరావుతో పాటు మున్సిపల్ సిబ్బంది, చిరు వ్యాపారులు పాల్గొన్నారు.

లేబర్ కార్డుతో ప్రయోజనాలు



మాట్లాడుతున్న కోఆర్డినేటర్లు, నాయకులు

జ్యోతినగర్: భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వం అందించే లేబర్ కార్డులతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఈఎస్ఐ కోఆర్డినేటర్లు భాస్కర్, తిరుపతి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు గుజ్జుల సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతీ కార్మికుడు లేబర్ కార్డుతో కలిగే ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికుల కోసం ప్రధానంగా నిర్మాణ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది నిర్మాణ కూలీల కోసం లేబర్ కార్డు సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. లేబర్ కార్డు సౌకర్యం ఉన్నవారికి ఉచిత వైద్య సదుపాయాన్ని కూడా కల్పిస్తోందని, లేబర్ కార్డు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు ఆడెపు శంకర్, రాయమల్లు, రాజయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలు మార్చాలి

యైటింక్లయిన్‌కాలనీ: ఎండల తీవ్రతతో అస్వస్థతకు గురవుతున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలను మార్చాలని, వారికి మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ నీరు అందించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ)రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం 8వ కాలనీ సివిక్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కాంట్రాక్టు కార్మికుల పనివేళలు మార్చాలని, సింగరేణి సివిక్ తోటమాలి తదితర విభాగాలలో పని చేస్తున్న సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఎండ తీవ్రతతో అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించి వారికి తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టవల్ తదితర సౌకర్యాలు కల్పించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. నాయకులు రామగిరి మధునక్క, గుడిసెల కొమురమ్మ, జి.స్వామి, నాగరాజు, ప్రకాశ్, లింగయ్య, అక్కపాక రాయమల్లు, రజిత, ఇ.లింగయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్‌ను కలిసిన సంఘం నాయకులు

పెద్దపల్లిరూరల్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌గౌడ్ కోరారు. సోమవారం కమిషనర్ వెంకటేశ్‌ను కలిశారు. వర్కర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి కొమురయ్యతో పాటు పలువురు సభ్యులున్నారు.

కరాటే పోటీ విజేతలకు ప్రశంస పత్రాలు



ప్రశంస పత్రాలతో విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి పాఠశాలలో సోమవారం నిర్వహించిన కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందించారు. ప్రతిభ చూపిన వారికి బెల్టులు ప్రదానం చేశారు. విద్యార్థులను కరస్పాండెంట్ చిప్ప భాస్కర్ అభినందించారు.

ఎన్‌సీసీకి విద్యార్థుల ఎంపిక



ఎంపిక చేస్తున్న ఎన్‌సీసీ అధికారులు

జ్యోతినగర్: ఎన్‌సీసీలో చేరేందుకు విద్యార్థులకు ఎంపిక నిర్వహించారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం పర్మనెంట్ టౌన్‌షిప్‌లోని సెయింట్ క్లేర్ హైస్కూల్‌లో ఎన్‌సీసీ అధికారి బి.సంజయ్, సుబేదార్ మనోహర్ ఎంపిక చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజ సేవ, దేశ రక్షణకు సంబంధించిన అంశాలను ఎన్‌సీసీలో నేర్పించనున్నట్లు తెలిపారు. జూనియర్ డివిజన్(బాలురు)లో 20 మంది, జూనియర్ వింగ్(బాలికల)లో 28 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కొత్తగా ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులను ప్రిన్సిపాల్ డామినిక్ అభినందించారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు



బోర్‌వెల్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్: ప్రజలకు వేసవికాలంలో తాగునీటి సమస్య లేకుండా బోర్‌వెల్స్ మరమ్మతు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి అన్నారు. సోమవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో ఉన్న అశోక్‌నగర్‌లో బోర్‌వెల్ మరమ్మతు ప్రారంభించామని తెలిపారు. మున్సిపల్ పరిధిలో ఉన్న బోర్‌వెల్స్ అన్ని మరమ్మతు చేసి ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చూస్తామన్నారు. ఇప్పటికే మానేరు నుంచి ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. నాయకులు గాజుల రాజమల్లు, పలువురు పాల్గొన్నారు.

దేవాలయాలు ఆధ్యాత్మిక ధ్యాన కేంద్రాలు



పూజల్లో ఎమ్మెల్యే విజయరమణారావు



ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

కాల్వశ్రీరాంపూర్: దేవాలయాలు ఆధ్యాత్మిక ధార్మిక ధ్యాన కేంద్రాలుగా వర్ధిలుతున్నాయని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని మొట్లపల్లి గ్రామంలో సోమవారం నూతనంగా నిర్మించిన దేవాలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, మాజీ సర్పంచ్ తులా మనోహర్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య పాల్గొన్నారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ నల్ల మనోహర్‌రెడ్డి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో వేర్వేరుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీటీసీ కౌసల్య, మాజీ సర్పంచులు నాగార్జున్‌రావు, గోనె శ్యాం, స్వరూప, మల్లమ్మ, సంగని నారాయణ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

మండలంలోని మొట్లపల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో శ్రీసీతారామచంద్ర స్వామి, గణపతి, సుబ్రమణ్యస్వామి, నవగ్రహాలు, మధున పోచమ్మ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. వేద బ్రాహ్మణులు నిట్టూరి సతీశ్‌శర్మ నేతృత్వంలో యజ్ఞం, హోమం చేశారు. అనంతరం బలిహరణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీటీసీ కౌసల్య, మాజీ సర్పంచులు తులా మనోహర్‌రావు, గోనె శ్యాం, స్వరూప, మల్లమ్మ, సంగని నారాయణ, సిటీకేబుల్ ఎండీ మామిడి చంద్రమౌళి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో కొనసాగుతున్న కూల్చివేతలు



కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో రోడ్ల విస్తరణ కోసం చేపట్టిన కూల్చివేతలు కొనసాగుతున్నాయి. సోమవారం స్థానిక ఓల్డ్ అశోక థియేటర్ ప్రాంతంలోని సులభ్ కాంప్లెక్స్‌ను జేసీబీ వాహనంతో కూల్చివేశారు. కూల్చిన సులభ్ కాంప్లెక్స్ కట్టడాల నుంచి ఇనుప ఊచలను తొలగించుకుపోవడాని పేదలు శ్రమించారు. థియేటర్ ముందున్న దుకాణాలను తాత్కాలికంగా కూల్చిన ప్రాంతంలోకి వెనక్కి తరలించాలని అధికారులు ఆదేశించినట్లు వ్యాపారస్తులు తెలిపారు.

లక్ష్మీదేవర ఉత్సవాలు ప్రారంభం



ఒడిబియ్యం పోస్తున్న భక్తులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట గ్రామంలో ఆదివాసీ పోడు గిరిజన తెగలకు చెందిన సుమారు 150 కుటుంబాల ప్రజలు వారి ఇలవేల్పుగా భావిస్తూ లక్ష్మీదేవర అమ్మవారి ఉత్సవాలను జరుపుకుంటారు. ఇందులో భాగంగానే సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా ప్రతి ఏటా ఉగాదికి తొమ్మిది రోజుల ముందు అమ్మవారిని కొలుచుకోవడం ఆనవాయితీగా వస్తోంది. తొలిరోజు లక్ష్మీదేవర అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఒడిబియ్యం పోశారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఉత్సవాలలో అమ్మవారికి పూజలు చేశారు.

ఆదివాసీలకు కాంగ్రెస్ పెద్దపీట వేస్తుంది

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేటలో సోమవారం నుంచి ఆదివాసీ నాయక్ పోడు గిరిజన తెగల లక్ష్మీదేవర అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వారి జాతి చిహ్నమైన ఆకుపచ్చ కండువాలను కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ అందజేశారు. మహేశ్ మాట్లాడుతూ జీవన విధానంతో పాటు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న ఆదివాసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, వారి జనాభాకు అనుగుణంగా చట్టసభల్లో సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. కిసాన్ సెల్ ప్రతినిధి మేర్గు కుమార్, పల్లె రవీందర్, ఆదివాసీ గిరిజన నాయకులు ఊరటి మహేశ్, తాళ్ల బుజ్జన్న, ఎలిగేటి సతీశ్, మానిక మల్లేశ్, గంట రమేశ్, ఊరటి రమేశ్, అగ్గిళ్ల మల్లేశ్, పటాని మహేశ్, బోయిని శ్రీనివాస్, బొట్లకుంట లక్ష్మణ్, మేడే లక్ష్మణ్ ఉన్నారు.

ఘనంగా భీరన్న కల్యాణం



కల్యాణంలో గొల్ల, కుర్మలు

ఎలిగేడు: మండలంలోని ముప్పిరితోట అనుబంధ గ్రామమైన మల్లయ్యపల్లిలో గొల్ల, కుర్మ కులస్తుల ఆరాధ్యదైవమైన భీరన్న పట్నాల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం మల్లయ్యపల్లిలోని బీరన్న ఆలయంలో బీరన్న, కామరాతి లగ్నపట్నాన్ని బీర్ల పూజారుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. బుధవారం స్వామివారి నాగవెల్లి పట్నం వంటి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. మాజీ సర్పంచ్ పెద్దోళ్ల ఐలయ్య, పెద్దగొల్ల రేచవేని సతీశ్, పెద్దకుర్మ కచ్చు బీరయ్య, కమిటీ సభ్యులు రేచవేని లింగయ్య, దాసరగొండ లింగయ్య, కచ్చు బక్కయ్య, రేచవేని మహేందర్, మారం సాగర్, గొల్ల, కుర్మ సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిస్తాం

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం టీయూడబ్ల్యూజే జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంత్రి, ఎమ్మెల్యేలకు వినతి పత్రం అందించారు. అర్హులైన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు రాయితీ పెంచాలని జిల్లా అధ్యక్షుడు సంపత్ కోరారు. నాయకులు బాలసాని రాజయ్య, చంద్రమౌళి, మల్లేశం, లింగమూర్తి తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మడక, కనగర్తి, జీలకుంట గ్రామాల్లో ఎస్సై జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వాహనాలను తనిఖీ చేశారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30కు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎమ్మెల్యే విజయరమణారావు హాజరుకానున్నట్లు చెప్పారు.

శ్రేష్ఠ కిడ్స్ పాఠశాల విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంక్

మంథని: ట్రస్మా, ఈ అభ్యాస్ హైదరాబాద్ వారు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఒలంపియాడ్ ఎగ్జామ్‌లో మంథనికి చెందిన శ్రేష్ఠ కిడ్స్ 5వ తరగతి విద్యార్థిని వేముల అభిగ్నగౌడ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి ర్యాంక్ సాధించింది. అలాగే రాష్ట్రస్థాయిలో బెస్ట్ స్కూల్ ఆఫ్‌ది ఇయర్ అవార్డుకు శ్రేష్ఠ కిడ్స్ స్కూల్ ఎంపికైంది. విద్యార్థిని, స్కూల్ యాజమాన్యానికి ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో బహుమతి ప్రదానం చేసి సన్మానించారు.